క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తేజశ్విని

పెద్దపప్పూరు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితమని వైద్యురాలు తేజశ్విని సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో ఎటువంటి ఆరోగ్యసమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా ఆశా వర్కర్ సహాయంతో 108 వాహన సేవలను వినియోగించుకుని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బిడ్డ ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డీజీపీకి శుభాకాంక్షలు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పెద్దయ్య

బుక్కరాయసముద్రం: రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు తీసుకున్న ద్వారకా తిరుమలరావుకు ఏపీఎస్పీ 14వ బెటాలియన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, పోలీస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు పెద్దయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీని కలసి పోలీసు సిబ్బంది సమస్యలను వివరించినట్లు పెద్దయ్య తెలిపారు. ఇందుకు డీజీపీ సానుకూలంగా స్పందించారన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



గుర్రప్ప (ఫైల్)

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో నివాసముండే రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప (80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అతడికి ఒక కుమార్తె ఉన్నారు. గుర్రప్ప మృతి పట్ల అధ్యాపకులు జేకే రాము, శ్రీకరం గోవిందరాజులు, రమణ సంతాపం ప్రకటించారు.


డాక్టరేట్ అధ్యాపకులకు సన్మానం



అధ్యాపకులు జనార్దన్ శాస్త్రి, పావనిని సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో పనిచేస్తూ వివిధ అంశాలపై పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందిన సీనియర్ కామర్స్ అధ్యాపకుడు జనార్దన్‌శాస్త్రి, ఫిజిక్స్ అధ్యాపకురాలు పావనిని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని సత్కరించారు. దేశంలో చిన్న తరహా పరిశ్రమలు–చారిత్రక విశ్లేషణ, ఎగుమతులు అనే అంశంపై సిక్కిం యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ విపుల్ జైన్ పర్యవేక్షణలో జనార్దన్ శాస్త్రి పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే 'స్టడీ ఆఫ్ ది సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సీయూసీఓ2 ఓ4 అండ్ జడ్‌ఎస్ సీఓ2 ఓ4 ఎలక్ట్రోడ్ మెటీరియల్స్ ఫర్ ఫర్‌ఫార్మెన్స్ బ్యాటరీ టైప్ సూపర్ కెపాసిటర్స్' అనే అంశంపై ఎస్కేయూ ప్రొఫెసర్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం వీ.లక్ష్మయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసి అధ్యాపకురాలు పావని డాక్టరేట్ పొందారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామస్వామి ఆలయ సందర్శన



ఆలయం వద్ద పురావస్తు శాఖ అధికారులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న అతిపురాతన శ్రీరామస్వామి దేవాలయాన్ని శుక్రవారం సాయంత్రం పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజినీర్ వీరాంజనేయులు, కన్జర్వేషన్ అసిస్టెంట్ బాల కృష్ణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ పునః నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ శివ ప్రసాద్, జనతా కెెఎం చౌదరి, సభ్యులు శ్రీధర్(బాచి), చక్రపాణి, రమేష్, శేషా, లక్ష్మన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- డీఆర్‌ఎం వినీత్‌సింగ్
- ఘనంగా యోగా దినోత్సవం

రోజూ యోగాతో జీవన శైలి వ్యాధులైన బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు, అధికారులు సూచించారు. గుండెజబ్బులు, చెడు కొలెస్ట్రాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యకర జీవితం గడపవచ్చన్నారు. రోజూ యోగా చేయడం ద్వారా మేథాశక్తి పెరగడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.



గుంతకల్లులో యోగాసనాలు వేస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: రోజూ యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని డీఆర్‌ఎం వినీత్ సింగ్ సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులు యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో కలిసి డీఆర్‌ఎం ఆసనాలు వేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీ శంకరనంద డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోపాల్, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్లు శివయ్య, నాగార్జున, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. ఇక డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్‌లో పట్టణ ఆయుష్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో యోగా మాస్టర్స్ తిప్పయ్య, శివనాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బారాముడు, మెడికల్ ఆఫీసర్ సజిదా, ఆహారోస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డు వివేకానంద పార్కులో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు మండలంలోని ఓబుళాపురంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి ముఖ్య అతిథిగా హాజరై యోగా వల్ల కలిగే ఉపయోగాలను గ్రామస్తులకు వివరించారు.

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది జఫ్రుల్లా, ఆంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పీ, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, ఆర్‌ఎస్‌లలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సురయ, యోగా మాస్టర్ భార్గవి, ఎన్‌ఎస్ ఆఫీసర్ రాజేష్, పీడీ జోయెల్ , నాసిర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏడీజే కోర్టు ఆవరణలో ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగా డే నిర్వహించారు. యోగా గురువు కృష్ణ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన యోగా డేలో డీఎంఈ ప్రమోద్, రైల్వే అధికారులు, కార్మికులు, యోగా మాస్టర్ ఓబులేసు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: రూరల్ పరిధిలోని ఆటో నగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఘనినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: స్థానిక కేజీబీవీ, లక్ష్మంపల్లి, చిత్రచేడు జెడ్పీ పాఠశాలల్లో యోగా డే వేడుకలను నిర్వహించారు.

యల్లనూరు: యోగా చేయం వల్ల మానసిక ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ జయప్రసాద్, వైద్యుడు లోకేష్‌కుమార్ అన్నారు. యల్లనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యోగా తరగతులను ఏఎన్‌ఎం శ్రీదేవి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజారెడ్డి, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: యోగాసనాల వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిప్యూటీ డీఈఓ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదినారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగనమల: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి నరసింహారాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో, ఎంపీడీఓ రమణ, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరనాయక్, ఈఓఆర్డీ మురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది దివ్య భారతి, శైలజా, నాగరాజు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా ఉపయోగ పడుతుందని ఎంపీపీ సునీత అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని సిద్దరాంపురంలో ఉపాధి కూలీలతో కలసి అధికారులు, ఎంపీపీ యోగాసనాలు చేశారు. అదే విధంగా మండల కేంద్రంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న బధిరుల పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రిలో, బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఎం పోలేరయ్య, ఆర్డీటీ ప్రధానోపాధ్యాయులు ఎర్రిస్వామి, బీకేఎస్ ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద యోగా గురువు గరిడి శివన్న, మండలంలోని ఆదర్శ పాఠశాల, మండల పరిధిలోని నగరూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక పెన్షనర్ల భవనంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగాకు ఆద్యుడైన పతంజలి స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, అశ్వర్థరెడ్డి, సేతు, రంగయ్య పాల్గొన్నారు.

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో డాక్టర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో, సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో యోగా గురువు సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీహెచ్‌ఓ జయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ గ్రేస్ లలిత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: రోజు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బీమ్ నాందేడే సూచించారు.శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా ట్రాక్టర్ నగర్‌లో ట్రైనర్ నీలం పరమేశ్వర రెడ్డి సిబ్బందితో యోగాసనాలు వేయించారు.

యోగాతో ఆరోగ్యం పదిలం: జడ్జి



గుంతకల్లు కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జడ్జి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు

గుంతకల్లుటౌన్: ఆధునిక మానవ జీవితానికి యోగా పరమ ఔషధం లాంటిదని, యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో యోగా ట్రైనర్ చింతా మునిస్వామి వివిధ రకాల యోగాసనాలతో అందరికీ అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగకరమైన యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, మహిళా సాధికార కమిటీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీకేఎస్‌లో యోగా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు



యాడికి ఆదర్శ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



గుత్తి గేట్స్ కాలేజీలో యోగా చేస్తున్న విద్యార్థులు



గుత్తిలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



తాడిపత్రిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థులు

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

యల్లనూరు: విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అనంతపురం ఆర్డీఓ వెంకటేష్ సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులు ఉపయోగిస్తున్న గదులు, మరుగుదొడ్లు, ఆరుబయట ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు బాలికలకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పౌష్టికాహారం అందజేయాలని ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మికి సూచించారు. ఆయన వెంట తహసీల్దారు జయప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, వీఆర్వో వినోద్ ఉన్నారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు అవసరం



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



తాడిపత్రి మండలం గన్నెవారిపల్లిలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శింగనమల/తాడిపత్రిటౌన్/యల్లనూరు/ పెద్దపప్పూరు: వర్షాకాలం ప్రారంభమైనదని మలేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ బీవీ రమణ సూచించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా శింగనమలలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు బారిన పడిన వారిని గుర్తించి, మందులను అందజేయాలన్నారు. ఇళ్ల చుట్టూ మురుగు నీరు, వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్ , ఎంఈఓ నరసింహరాజు, ఈఓఆర్డీ మురళీకృష్ణ, సీహెచ్‌ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి మండలంలోని గన్నెవారిపల్లి సచివాలయం–2 పరిధిలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ క్రిష్ణమోహన్ సెక్రటరీ రాజేష్, ఏఎన్‌ఎం సునీత, హరిత , ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా యల్లనూరు పీహెచ్‌సీ పరిధిలోని 1,2,3 వార్డుల్లో జాతీయ మలేరియా మాసోత్సవంపై వైద్యుడు లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగు కుంటల్లో కాల్వల్లో మలాథిన్ స్ప్రే చేయించారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్ , హాస్టల్‌లో అబెట్ మందు స్ప్రే చేయించారు. కార్యక్రమంలో తహసీల్దారు జయ ప్రసాద్, సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, హెల్త్‌అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో ఈఓఆర్డీ కమలాబాయి, డా.తేజస్విని ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఇళ్లముందర నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠ్య పుస్తకాల గది సీజ్

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఏవీఆర్ కార్పొరేట్ పాఠశాలలోని పాఠ్య పుస్తకాల గదిని శుక్రవారం ఎంఈఓ రవి నాయక్ సీజ్ చేశారు. వివరాలు.. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ , పలువురు సభ్యులు గురువారం ఏవీఆర్ పాఠశాలకు వెళ్లారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను నిలువ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎంఈఓతోపాటు తహసీల్దార్ భారతికి తెలియజేశారు. వెంటనే వారు పాఠశాలకు వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి, పాఠ్య పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి, బాలాజీ, ధన, వినయ్, అనిల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

నార్పల: శ్రీ సంపద మహిళ కోఆపరేటివ్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫేర్రర్ సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయం వద్ద ఏర్పాటైన శ్రీ సంపద మహిళ కోపరేటివ్ బ్యాంకు ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఉన్నా 175 పొదుపు సంఘాల గ్రూపులకు చెందిన 2,020 మంది మహిళలు ఆర్డీటీ ఆధ్వర్యంలో శ్రీ సంపద మహిళ కోపరేటివ్ బ్యాంకు ఏర్పాటు చేసుకున్నారు. రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఏటీఎల్ రామాంజనేయులు, సీఓ గోవిందు, కోచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి

పామిడి: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీ నిర్వాహకులు శుభ్రత పాటించాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్ సూచించారు. శుక్రవారం ఆమె పామిడిలోని పలు దుకాణాలపై ఆకస్మిక తనిఖీ చేశారు. చాలా మంది లైసెన్సు లేకుండా దుకాణాలు నిర్వర్తిస్తుండడాన్ని ఆమె గుర్తించారు. ఈసందర్భంగా ఎనిమిది మందికి నోటీసులు జారీ చేశారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: 'ఎన్నికల్లో గెలుపోటములు సహజమే. గతంలో ఎన్నడూ లేని విధంగా మన ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించాం. అయినా ప్రజల తీర్పును గౌరవించాల్సిందే. ఓడిపోయామని ఎవ్వరూ అధైర్యపడొద్దు. వైఎస్సార్‌సీపీ సైనికులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తా' అని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన పార్టీ కౌన్సిలర్లు, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. వైవీఆర్ మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో ఎప్పుడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడటం శోచనీయమన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు ఇలాగే కొనసాగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్ష హోదాలో కొనసాగడం వైఎస్సార్‌సీపీకి కొత్తకాదన్నారు. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు కొనసాగిద్దామని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు టీడీపీ ప్రలోభాలకు లోనుకావొద్దన్నారు. వైఎస్సార్‌సీపీకే కౌన్సిల్ మెజార్టీ ఉంది కాబట్టి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలోమున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, ఎస్సీసెల్ జోనల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకులు మల్లికార్జున శాస్త్రి భీమలింగప్ప, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

యల్లనూరు: వైఎస్సార్ విగ్రహాలు, నూతన సచివాలయాల శిలాఫలకాలు ఎక్కడైనా ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శిలాఫలకాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న సమస్యలను పెద్దవి చేసుకుని ఘర్షలకుకు పాల్పడవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులుగౌడ్, సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు వీర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపాలి

పెద్దవడుగూరు: బడికి వెళ్లే వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ పాఠశాలకు పోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్ లో ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలకు వెళ్లే వయస్సున్న పిల్లల వివరాలు సేకరించి, వారిని బడికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

గుత్తి రూరల్: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఢిల్లేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని జక్కల చెరువు ఆర్‌ఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది రామాంజనమ్మ, శారద, విజయమ్మ, రత్న, శారద, ఉపాధ్యాయినిలు సుప్రియ, నాగరత్న, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ ఆదినారాయణ పాల్గొన్నారు.

అరుదైన గ్రూపు రక్తదానంతో ప్రాణదానం

పామిడి: ప్రాణాపాయ స్థితిలో కొట్టిమిట్టాడుతున్న ఓ బాలుడికి శుక్రవారం రక్తదానం చేసి ప్రాణదాత అయ్యాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంతకల్లులోని గుప్తా హాస్పిటల్‌లో 15 ఏళ్ల బాలుడు రక్తహీనతతో ప్రాణాపాయ స్థితికి చేరాడు. దీంతో అక్కడి వైద్యులు బాలుడు బతకాలంటే అరుదుగా లభించే ఏబీ పాజిటివ్ రక్తం అవసరమన్నారు. సమాచారం అందుకున్న జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు బంగారు శీనా వెంటనే ఏబీ–పాజిటివ్ గ్రూపు ఉన్న కుమారుడు బంగారు సాయితో రక్త దానం చేయించి బాలుని ప్రాణాలు కాపాడారు. ఇందుకు బాలుని కుటుంబం రక్తదాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గుత్తి: ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మీనాక్షి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

పెద్దవడుగూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లిలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు వడ్డీ లేకుండా రూ.3 లక్షలు రుణమివ్వాలన్నారు. ఎరువులు, పురుగులమందులు, సూక్ష్మపోషకాలు 90 శాతం సబ్సిడీతో అందజేయాలన్నారు. రైతు సంఘం నాయకులు పోలా రంగయ్య, అల్లాబకాస్, శేషగోపాల్, బద్దెల గోపాల్, గొడ్డలిరాయుడు, మస్తాన్, నాగరాజు, నరేష్, నాగభూషణ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

యల్లనూరు: మండల కేంద్రంలోని కస్తూరిబా స్కూల్ పరిసర ప్రాంతాల్లో జూద కేంద్రంపై పుట్లూరు సీఐ సుబ్రమణ్యం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ25,380 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోయాడు. ఏఎస్‌ఐ శ్రీనివాస గౌడ్, పీసీలు రవీంద్రారెడ్డి, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.